రామకృష్ణ మఠంలో ఘనంగా సంప్రీది దివస్ వేడుకలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జ్ఞానం, భక్తి, సేవ ద్వారా వికసిత్ భారత్ సాధ్యమని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. అమెరికాలోని చికాగో విశ్వమత మహాసభల్లో స్వామి వివేకానంద ప్రసంగించి 131 ఏళ్లు అయిన సందర్భంగా రామకృష్ణ మఠంలో బుధవారం సంప్రీది దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద సాహిత్య పఠనంతో పవిత్రత, సహనం, పట్టుదల పెరుగుతాయన్నారు. వివేకానంద అమెరికా వెళ్లేముందు 1893 ఫిబ్రవరిలో వారం రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించి సికింద్రాబాద్ లోని మహబూబ్ కళాశాలలో ఫిబ్రవరి 13న తన జీవితంలో తొలిప్రసంగం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్యూమైన్ నాలెడ్జ్ రిసోర్సెస్ సీఈవో శ్రీనివాస్ వెంకటరామన్ మాట్లాడుతూ.. వివేకానందుడి సాహిత్యాన్ని చదవడం మాత్రమే కాకుండా అధ్యయనం చేయాలని యువతకు సూచించారు. సంప్రీది దివస్‌లో భాగంగా ట్యాంక్‌బండ్‌పై వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రామకృష్ణ మిషన్, మఠం ఉపాధ్యక్షుడు స్వామి సుహితానంద పాల్గొన్నారు. అనంతరం ట్యాంక్ బండ్ నుంచి రామకృష్ణ మఠం వరకు ర్యాలీ నిర్వహించారు.

వీహెచ్‌ను కలిసిన మహేష్‌కుమార్‌గౌడ్


వీహెచ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

రాంనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం బాగ్‌అంబర్‌పేటలోని వీహెచ్ నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తుందని, మహేష్‌కుమార్ గౌడ్ నియామకమే దీనికి నిదర్శనమన్నారు. పార్టీ నేతలు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, తొలుపునూరి కృష్ణగౌడ్, రాష్ట్ర ఫిషరీష్ కమిషన్ ఛైర్మన్ మెట్టు సాయి, మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్‌గౌడ్, పుల్ల నారాయణస్వామి, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి


గౌతమ్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని, ఈ నెల 17న వినాయక నిమజ్జనం నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. రోడ్లతో పాటు డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బుధవారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోడ్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే పడేశారని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. నిమజ్జన ఉత్సవాలపై ఎలాంటి ఆంక్షలు విధించవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


సభ్యత్వ నమోదు చేపడుతున్న పార్టీ నేతలు

బీజేపీ సభ్యత్వ నమోదు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.గోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీనగర్ డివిజన్ పోలింగ్‌స్టేషన్ 12 పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గోపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. మాజీ కార్పొరేటర్ టిశైలజాగోపాల్, మధుగౌడ్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నందమూరి బాలకృష్ణ 50 సినీ వసంతాల స్వర్ణోత్సవ వేడుకలు బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో కళారవిందం సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పలువురు గాయనీగాయకులు బాలకృష్ణ నటించిన సినిమాల పాటలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ సంస్థల అధినేత డా. వంశీరామరాజు మాట్లాడుతూ.. బాలకృష్ణ ఎంతో ఉదారత స్వభావుడన్నారు. తోటి కళాకారులు, దర్శకులను ఆయన ఎంతో ఆప్యాయంగా పలకరిస్తారని తెలిపారు. బాలకృష్ణ నటించిన సీమసింహం సినిమా దర్శకుడు జి.రామ్‌ప్రసాద్‌ను సన్మానించారు. రేవతి, నాగేందర్, రేణుక, రమేష్, ప్రభాకర్, కోదండరామ్, కృష్ణవేణి, భారతినాగరాజ్ పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుడి బ్యాగులోని రూ.43 వేలు మాయం

బర్కత్‌పురా, సెప్టెంబర్11 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుడి బ్యాగులో ఉన్న నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివసించే సుమంత్ కల్యాణ్ (25) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తుండగా ఫలక్‌నామ వద్ద బ్యాగులో ఉన్న రూ.43 వేలను దొంగలు ఎత్తుకెళ్లారు. బ్యాగులో ఉన్న ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను మాత్రం తీసుకోలేదు. బుధవారం రాత్రి బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప వెల్లడించారు.


రాంనగర్ ఆర్యవైశ్య సంఘానికి ఉత్తమ సేవలందిస్తున్న సంఘం కోశాధికారి ఎర్రం శ్రీనివాస్ గుప్తాను బుధవారం రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, సంఘం నేతలు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

నిమజ్జన ఊరేగింపులు సజావుగా సాగేలా చర్యలు


వీఎస్టీ రోడ్డును పరిశీలిస్తున్న ముషీరాబాద్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్

రాంనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముషీరాబాద్, అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ముషీరాబాద్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్, డీఈ సన్నీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ నియోజకవర్గంలోని రాంనగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, కవాడిగూడ, దోమలగూడ మార్గాలను పరిశీలించారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడడం, చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు గణపతి విగ్రహాలకు తగలకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని నిమజ్జన మర్గాలను అంబర్‌పేట డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఇంజనీరింగ్ అధికారులు బాగ్‌అంబర్‌పేట, ఛే నెంబర్ చౌరస్తా, నల్లకుంట, కాచిగూడ, అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఊరేగింపులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై
తీర్పును రద్దు చేయాలని డిమాండ్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న చెన్నయ్య తదితరులు

కవాడిగూడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, వెంటనే రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వందకు పైగా రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, ఇలాంటి సమయంలో ఎస్సీ వర్గీకరణకు క్రిమిలేయర్ అమలు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టడం సరికాదన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తిరుగుబాటు చేస్తామని ఆయన హెచ్చరించారు.

చెన్నయ్య ఆధ్వర్యంలో..

ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కులాలను వర్గీకరించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 పరిగణలోకి తీసుకోరాదన్నారు. ఈ తీర్పును దేశంలోని మెజార్టీ దళితులు, గిరిజనులు, అంబేడ్కర్ యువజన సంఘాలు, బహుజన సమాజ్ పార్టీ, సమాజ్‌వాది పార్టీ, లోక్‌జన శక్తి పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీలను రాజకీయ అధికారానికి దూరం చేసేందుకే ఈ తీర్పు ఇచ్చారని ఆయన ఆరోపించారు.

అభివృద్ధి పనులకు
నిధులు మంజూరు చేయండి


నరేంద్ర పార్కులో పెండింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నల్లకుంట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.11 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు..

నల్లకుంట డివిజన్‌లోని పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని నరేంద్రపార్కును ఆయన సందర్శించారు. పార్కులో పెండింగ్‌లో పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, పార్కు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలిసి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

మెట్రో పార్కింగ్ లక్ష్యంగా ద్విచక్రవాహనాల చోరీ

- మూడు కమిషనరేట్ల పరిధిలో 59 వాహనాలు
- స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడితో పాటు ఇద్దరు రిసీవర్ల అరెస్ట్


దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, పోలీసులు

బేగంపేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్, బస్టాండ్, మెట్రో పార్కింగ్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న కరుడుగట్టిన దొంగ రాయుడు చైతన్యసాయికుమార్ (33)తో పాటు ఇద్దరు రిసీవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన 59 ద్విచక్రవాహనాలను వారి నుంచి బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని పాల్వంచకు చెందిన రాయుడు చైతన్యసాయికుమార్ పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. ఉపాధి కోసం నగరానికి వచ్చి పలు ప్రైవేట్ సంస్థల్లో పనిచేశాడు. విలాసాలకు అలవాటుపడిన సాయికుమార్ సక్రమంగా విధులకు రాకపోవడంతో తొలగించేవారు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో వాహనాల చోరీలు ప్రారంభించాడు. మెట్రో, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలోని పార్కింగ్ స్థలాల నుంచి ద్విచక్రవాహనాలను చోరీ చేయడం ప్రారంభించాడు. వాహనాల హ్యాండిల్ లాక్‌ను విరగ్గొట్టి మరో లాక్‌తో వాహనాలను కాజేసేవాడు. చోరీ చేసిన వాహనాన్ని వెంటనే విక్రయించకుండా మరొక పార్కింగ్ స్థలంలో పెట్టేవాడు. ఈ వాహనాల వివరాలను రిసీవర్లకు పంపేవాడు. వాహనం విక్రయించే సమయంలోనే దాచిన పార్కింగ్ స్థలం నుంచి వాహనాన్ని తీసుకెళ్లేవాడు. గతంలో నగరంలోని ఉప్పల్, మాదాపూర్, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 27 వాహనాలను చోరీ చేసిన కేసులో ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన సాయికుమార్ మళ్లీ చోరీల బాటపట్టాడు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 17, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 18, రాచకొండ పరిధిలో 19 ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. ఓ చోరీ కేసులో బేగంపేట పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తుండగా పార్కింగ్ ప్రాంతంలో వాహనాన్ని చోరీ చేస్తూ సాయికుమార్ కనిపించాడు. దీంతో సాయికుమార్‌పై నిఘా పెట్టి పట్టుకున్నారు. సాయికుమార్‌తో పాటు ఇతడి వద్ద వాహనాలను కొనుగోలు చేస్తున్న కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లికి చెందిన ఎం.జగదీష్(28), ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన కుంచాల హరికృష్ణ(25)ను అరెస్టు చేశారు. దొంగలను పట్టుకోవడంతో పాటు 59 ద్విచక్రవాహనాలను రికవరీ చేసిన బేగంపేట పోలీసులకు డీసీపీ రష్మీ పెరుమాళ్ నగదు పారితోషకాన్ని ఇవ్వడంతో పాటు అభినందించారు. సమావేశంలో అదనపు ఏసీపీ అశోక్, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు రామయ్య, మధుసూదన్‌రెడ్డి, ఎస్సైలు గంగాధర్, జయచంద్ర పాల్గొన్నారు.

'తెలుగు తులసీదాసు ఎమ్మెస్ రామారావు'


ఎమ్మెస్ రామారావుకు నివాళులర్పిస్తున్న దామోదర్‌గుప్తా, జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా తొలి నేపథ్య గాయకుడు ఎమ్మెస్ రామారావు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా సుందరకాండ ఎమ్మెస్ రామారావు యాదిలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. అచ్చమైన తేట తెలుగులో సుందరకాండను సామాన్య ప్రజలు సైతం అర్థం చేసుకునేలా అందించిన తెలుగు తులసీదాసు ఎమ్మెస్ రామారావు అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ.. ఎమ్మెస్ రామారావుకు తమ తండ్రి కళాసుబ్బారావుతో అనుబంధం ఉందని, గానసభ వేదికపై ఆయనను పలు సంస్థలు సత్కరించాయన్నారు. గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి, కవి చిక్కా రామదాసు, గాయనీగాయకులు త్రినాథరావు, రమాదేవి పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

రాంనగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అసెంబ్లీ స్పీకర్ వెంటనే అమలుచేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరారని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించడం హర్షణీయమన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ నాలుగు వారాలలో చర్యలు తీసుకుని తన పదవికి వన్నె తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాగు నగేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నేడు

- హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో

మదీన, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ అపియ చిన్నమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు. ఎకానమిక్స్ (ఉర్దూ మీడియం)-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఇంగ్లిష్ మీడియం)-1, బయోటెక్నాలజీ (ఇంగ్లిష్ మీడియం)-1, కంప్యూటర్‌సైన్స్ అండ్ అప్లికేషన్స్ (ఇంగ్లిష్ మీడియం)-3, జువాలజీ (ఇంగ్లిష్ మీడియం)-2 పోస్టులు ఖాళీలున్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీలకు 50శాతం మార్కులు ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగినవారికి, బోధనానుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ 1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. గగన్‌మహల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్, గగన్‌మహల్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.. గోశాల పరిధిలోని అంబేడ్కర్ భవన్, రజక కాలనీ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం తెలంగాణ స్టేట్ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్‌గౌడ్ కలిసి సత్కరించారు. గౌరవ సలహాదారులు బి.బాల్‌రాజ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు జి.విజయ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. -(బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)


రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తన నెల రోజుల జీతాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ నిధి కోసం బుధవారం సీఎంఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌కు చెక్కు అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి


భోలక్‌పూర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్


పూజలు నిర్వహిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ తదితరులు


రాంనగర్ గుండు చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.శేషసాయి తదితరులు


బాగ్‌అంబర్‌పేటలో కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

వైభవోపేతంగా కొనసాగుతోన్న గణేశ్ నవరాత్రులు


బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పూజలు నిర్వహించిన బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి

కవాడిగూడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. తాళ్లబస్తీలో గోల్డెన్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మున్సిపల్ కార్మికులను సత్కరించారు. దోమలగూడ పూల్‌బాబ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడికి కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ పూజలు నిర్వహించారు.


నల్లకుంట నర్సింహబస్తీలో బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు


నింబోలి అడ్డ మహాకాళి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న తూర్పుమండలం అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ ఏసీపీ వి.రఘు, సీఐ చంద్రకుమార్ తదితరులు

ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో..

చిక్కడపల్లి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం స్వామివారికి దూర్వార్చన నిర్వహించారు. స్వామివారికి పుష్పాలంకరణ పూజ చేశారు. సుప్రభాతం, బిందెతీర్థం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి మూలమంత్రహవనము, పల్లకీసేవ, బలిహరణ, నివేదన, హారతి, మహామంత్రపుష్పం కార్యక్రమాలను ఆలయ ఈవో లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు.

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు సన్మానం..


ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గుండు జగదీశ్‌బాబు

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వీడీ కృష్ణ, శీలం సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగ్ రావు, సురేష్‌యాదవ్, సురేందర్, బాబూరావు, శంకర్‌గౌడ్, రాజు, మధు, సతీష్, అభిషేక్ కెన్నడీ పాల్గొన్నారు.